తేది. 29-05-1989న భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము

# కృష్ణుడున్నచోటనే విజయము

శరీర వికాసము అంతకంతకు పెంచుకుంటూ పోతున్నప్పటికిని వారి జీవితము ప్రాకృత జీవితంతో ముడిపడి ఉన్నది. ఈ ప్రాకృత మనగా ఏమిటి? ప్రాపంచిక సంబంధమైనది ప్రాకృతమని భావిస్తున్నాము. ప్రాకృతస్థితి అనగా అదికాదు. నిరంతరము ఇంద్రియానందము పొందే నిమిత్తమై తన జీవితమును, తన కాలమును, తన కాయమును దుర్వినియోగము చేస్తున్నాడేగాని అన్నింటికిని ఆధారమైన తత్త్వము ఏమిటి? అనే సత్యమును విచారించుకోలేకపోతున్నాడు. చూచునవి కన్నులని భ్రమిస్తున్నాము. మాటాడునది నోరు అని భ్రమిస్తున్నాము. వినేది చెవులని భ్రమిస్తున్నాము. ఇదే ప్రాకృతమైన స్థితి. చూచేది కన్నులు కాదు. వినేవి చెవులు కాదు. మాటాడునది నోరు కాదు. అన్నింటికిని ఆధారమై అధిష్ఠానమై ఉండిన ఆత్మతత్త్వమే ఈ ఇంద్రియముల ద్వారా అన్ని పనులు చేయిస్తున్నది.

Fan తిరుగుతున్నాది. బల్బులు వెలుగుతున్నాయి. స్టౌ వంట చేస్తున్నాది. మిషన్ వర్క్ చేస్తున్నది అని అనుకుంటే ఇవన్నీ కరెంటు ఆఫ్ చేస్తే తిరుగుతుందా, వెలుగుతుందా. ఈ కరెంటే లేకపోతే fan తిరగ్గలదా? బల్బు వెలగగలదా? స్టౌ వంట చేయగలదా? మిషన్ వర్క్ చేయగలదా? కాదు కాదు అన్నింటికిని కరెంటే ఆధారము. అదియే మానవునియందున్న దివ్యశక్తి. అదియే ఆత్మ. ఆ ఆత్మతత్త్వం చేతనే మానవునియందున్న సర్వాంగములు కూడను పని చేయగలుగుతున్నాయి Dead body ఉంటుంది. కన్నులున్నాయికాని చూడగలుగుతుందా? చెవులున్నాయి కాని వినగలుగుతున్నాయా? నోరుంది కాని మాట్లాడగలుగుతుందా? పూర్వం మాట్లాడేవాడు, పూర్వం చూచేవాడు, పూర్వం విన్నటువంటివాడు ఈ దేహములో లేడు. కనుకనే ఇవన్నీ స్తంభించిపోయాయి. కేవలం ఒక విధమైన జడప్రాయంగా మారిపోయింది.

ఈ ఇంద్రియముల ఆనందము నిమిత్తమై, ఇంద్రియములయొక్క సుఖము నిమిత్తమై పవిత్రమైన మానవత్వాన్ని వ్యర్థం చేస్తున్నాడు మానవుడు. చదువులు చదివేకొలది ఇంద్రియ భ్రాంతి అధికమవుతున్నదేగాని ఈ సత్యాన్ని గుర్తించుకోలేని మూర్ఖత్వం వారిలో పెరిగిపోతుంది.

sri sathyasai vachanamrutam

ఇంక విద్య పెరిగేకొలది ఇంద్రియ భోగములు, ఇంద్రియ ఆనందములు, ఇంద్రియ సుఖాలు ఆశిస్తున్నారు. ఇంక ఏమిటి ఈ చదువుయొక్క ఏడుపు? ఈ చదువుయొక్క విశిష్టత ఏమిటి? కేవలం పొట్ట పోసుకునే కోసమా ఈ చదువులు? అంతర్భావాన్ని అర్థం చేసుకోలేని చదువులంతా అగ్నిలో వేసినా కాలవు. కనుక ఆత్మతోపాటు విద్యను కూడా అనుభవించినప్పుడే సంస్కారముతో బాటు చదువులు కూడా ఏర్పడతాయి. కేవలము మానవుడు అన్నీ తానే చేయగలుగుతున్నానని, తానే చూడగలుగుతున్నానని, తనకే ఈ విధమైన విల్ పవర్ ఉందని భావిస్తున్నాడు. కదలదు నీదు సంకల్పము లేనిదే గడ్డిపోచ యున్. దైవానుగ్రహము లేకపోతే మానవుడు అడుగైనా ముందుకు వేయలేడు. కాని నేను చేస్తున్నాననే అహంకారానికి అవకాశమిచ్చి, అజ్ఞానస్థితిలో దినదినమునకు దిగజారి పోతున్నాడు. అహంకారముండినంత వరకు మానవునికి ఆత్మ విషయం ఏమాత్రము అర్థము కాదు. అహంకారమంటే ఏమిటి? దేహాభ్రాంతియే అహంకారము. దేహము ఒక పనిముట్టు. ఈ పనిముట్టును ఆధారంగా చేసుకొని నీవు పని ఆచరించాలి. మనం ఈ పనిముట్టు అనే దేహమునకే ప్రాధాన్యము ఇస్తున్నాముగాని ఈ పనిని ఆచరింపచేసే శక్తికి మనము ఏమాత్రము అవకాశం ఇవ్వటం లేదు. ఇట్టి దివ్యత్వాన్ని, ఇట్టి సమత్వాన్ని, ఇట్టి బ్రహ్మత్వాన్ని చాటే నిమిత్తమై అవతారములు వస్తూ ఉంటాయి.

ఎందుకంటే సత్యాన్ని నిరూపించే శక్తి ఒకటి అత్యవసరం. పూలు, సూది దారం ఉన్నాయి. పుష్పమాల తానగునా? కుట్టేవాడు ఉండాలి కదా! ప్రమిద, వత్తి, నూనె కలవు. దీపము వెలుగునా? ముట్టించేవాడు ఒకడు ఉండాలి కదా! అదే విధముగనే విద్యగలదు. అక్షరము కలదు. అక్షరము యొక్క రూపాన్ని నిరూపించే చదువు ఉండాలి కదా! దీనిని సక్రమమైన మార్గములో ప్రవేశపెట్టి అర్థముగావించే నిమిత్తమై బోధించేవారు ఒకరు ఉండాలి కదా! స్వర్ణము, రత్నాలు కలవు సొమ్ములు నిర్మాణమగునా? ఈ గోల్డు లోనికి ఆ రత్నాలు చొప్పించేవాడు ఒకడు ఉండాలి కదా! మానవత్వమనేది ఒక సువర్ణము వంటిది. వారి తెలివితేటలు రత్నముల వంటివి. దానిని సరియైన రీతిలో ఉపయోగించుకునే వానిని నీవు గుర్తించుకోకపోతే సువర్ణములకు, రత్నములకు కూడా విలువపోతుంది. కబీర్‌దాస్ చెప్పాడు నామ నిరూపణ మూల వితంతే రత్నముయొక్క విలువ తెలియనివాడు దానిని దుర్వినియోగం చేసుకుంటాడు. ఎవడా రత్నముయొక్క విలువ తెలుసుకుంటాడో వాని జీవితంలో చాలా శాంతి భద్రతలు

sri sathyasai vachanamrutam

ఏర్పడతాయి. అదేవిధముగా భగవంతుని యొక్క రూపనామములనే రత్నములయొక్క విలువను గుర్తించినవాడు మాత్రమే దీనిని సక్రమమైన రీతిలో వినియోగించుకోగలడు. దానిని చులకనగా భావించే మూర్ఖుడు తద్వారా తన జీవితమునే వ్యర్థము చేసుకుంటాడు. కనుక అట్టి విలువ గుర్తించే మానవత్వం ఈనాడు క్షీణించిపోయింది. మానవుడుగా ఉన్నాడుగాని మానవత్వం శూన్యమైపోయింది. కనుకనే ఆకారం చూసి మానవుడని భ్రమించ వద్దు. ఆకార మానవుని వలన లోకానికి యేమాత్రం ప్రయోజనం లేదు. ఆచార మానవుడు కావాలి. విచార మానవుడు అభివృద్ధి కావాలి. ఆచార విచారములు ఉండినప్పుడే మానవత్వం సార్థకమవుతుంది.

**ఘంటాకర్ణుడు**

ఈనాడు విచారణా శక్తి ఉంది. ప్రయోజనం ఏమిటి? మంచిని చెడ్డగా చెడ్డను మంచిగా చూస్తున్నాడు. కనుక ఈ విచారణాశక్తి ఉండి ప్రయోజనం లేదు. ఆచరణతో కూడిన విచారణ ఉండినప్పుడే సరియైన అర్థము గుర్తించగలరు. ఒక చిన్న ఉదాహరణము. ఘంటాకర్ణుడు అని ఒక వ్యక్తి ఉండేవాడు. ఇతను కుబేరుని యొక్క సోదరుడు. అతనికి ఆస్తిపాస్తులందుగాని, ధన కనక వస్తు వాహనాదులందుగాని ఏమాత్రం కూడ తక్కువ కాదు. ఇతను బదరికాశ్రమము అనే అడవులలో సంచరించాడు. ఇతని నిత్యజీవితం ఏమిటి? బ్రహ్మముహూర్తములో లేస్తాడు. ధ్యాన సమాధులంతా అనుభవిస్తాడు. తనయొక్క ఆయుధాలు చేత పూనుతాడు. అడవులకు ప్రయాణమవుతాడు. అడుగు పెట్టినప్పుడంతా హరినామాన్ని స్మరిస్తాడు. ఉచ్ఛ్వాస నిశ్వాసము లేరీతిగా జరుగుతున్నాయో రామస్మరణకూడా ఆ రీతిగా జరుగుతోంది. కాని చేతలలో మాత్రం మృగాలను చంపుతున్నాడు. ఇతనియొక్క ఆకారం వికారం. ఆ వికారమునకు తగినట్లుగానే ఆచారములను చేస్తున్నాడు. ఏ ప్రాణి కంటికి కనబడినా దానిని చంపటం. ఆ చంపే సమయంలో హరి ఓం అనటం, దానిని చంపటం. ఈ విధంగా సంచరిస్తూ జీవితాన్ని గడుపుతున్నాడు. పరమభక్తుడు ఈ ఘంటాకర్ణుడు.

ఒకనాడు కృష్ణుడు బదరికాశ్రమానికి వెళ్ళాడు. వశిష్ట, జమదగ్ని సంప్రదించి రావటానికి. ఇలాంటి గొప్ప ఋషులనంతా సంప్రదించాలని వెళ్ళాడు. ఎందుకు వారిని సంప్రదించాలి. ఋషి మానస సంచారి భగవంతుడు. కనుక ఈ ఋషుల యొక్క యోగక్షేమాలు విచారించే

sri sathyasaivachanamrutam

నిమిత్తమై ప్రత్యక్షంతోనే ప్రయాణం చేస్తూ వచ్చాడు. వారితో సంప్రదించి, వారి యోగక్షేమాలంతా విచారించి వారి ధ్యాన సమాధులంతా ఏమైనా అభ్యంతరాలు జరుగుతున్నాయా? ఇలాంటి అభ్యంతరాలు జరుగుతుంటే వానిని నివారించేందుకు నేను సిద్ధంగా ఉన్నాను అని వారికి హామీ ఇచ్చాడు. వారు మాకెట్టి అభ్యంతరాలు లేవు పవిత్రమైన హిమచలమున కూర్చుని బదరికాశ్రమములో వేము నివాసం చేస్తూ భగవంతుని ఆనందాన్ని అమితంగా పొందుతున్నామన్నారు. అక్కడి నుండి అరణ్యములోనికి ప్రయాణమయ్యాడు. కృష్ణుడు ప్రయాణమైపోతున్న సమయంలో ఒక పెద్ద గుంపు వచ్చింది. హరిఓం హరిఓం అంటూ నామస్మరణ చేస్తూ వస్తున్నారు. వారి ఆకారములు చూస్తే మహా భయంకరంగా ఉన్నాయి. వారి తర్వాత ఒకడు మహారాజువలె వస్తున్నాడు. హరి ఓం అనుకుంటూ అనగా ఈ యొక్క పరివారానికి అతను అధిపతి. వీరి భయంకర శబ్దములు విని మృగములన్నీ పరుగెత్తి పోతున్నాయి. దానిపైన గురిపెట్టి అదేపనిగా వానిని కొడుతున్నారు.

కృష్ణుడు యోచన చేశాడు. చెప్పేది నామస్మరణ. చేసేది జీవహింస. దేవుని పూజించటం. జీవుని హింసించటం ఏమిటి దీని అర్థం. ఆ విధంగా చూస్తూ ఉండగనే సాయంకాలమైంది. చక్కని కాలము 5-45 అయింది. ఎక్కడి వారక్కడ కుర్చున్నారు. ఘంటాకర్ణుడు కూర్చున్నాడు. meditation start చేశారు. సకాలంలో వారి సాధనా క్రమము నేమాత్రం కూడ వీడలేదు. అంతసేపు వీరిని distrub చేయకూడదని కృష్ణుడు ఒక చెట్టు చాటున కూర్చున్నాడు. ఇంక మేడిటేషన్ అయిపోయింది. హరి ఓం అని లేచాడు ఘంటాకర్ణుడు. తక్షణమే ప్రత్యక్షమయ్యాడు కృష్ణుడు. మీరెవరు? మీ నామధేయమేమిటి? మీ కర్తవ్యమేమిటి? మీరు చేసే ఈ ధ్యానమేమిటి? అని అనేక రకాలుగా ప్రశ్నించాడు. ఈ కృష్ణుని యొక్క తేజస్సును చూసి ఋషులంతా పూర్వం తపస్సుచేసి వేదాహమేతం పురుషం మహాన్తం ఆదిత్యవర్ణం తమీన స్వరస్తాత్. అని అన్నటువంటి దృశ్యము ఈ ఘంటాకర్ణుని నేత్రములకు చేరింది. కోటి సూర్యుల కాంతితో వెలుగుతోంది ఈ కృష్ణుని యొక్క ముఖము. ఆ యొక్క దివ్యజ్యోతికి సంబంధించిన ఈ కళను చూసి ఘంటాకర్ణుడు చాలా మైమరిచిపోయాడు. తనకు తెలియకుండానే మోకాళ్లపైన కూర్చున్నాడు. తన చేతియందున్న ఆయుధాలంతా ప్రక్కకు పడవేశాడు. రెండు చేతులను చేర్చాడు. మహానుభావా! మీరెవరు? అప్పుడు చెప్పాడు కృష్ణుడు నేనెవరు అనేది నీకు తెలియదా? నిత్యము ధ్యానము

srisathyasaivechanamrutam

చేస్తున్నావు ఎవరిని చేస్తున్నావు ధ్యానము? కేవలం హరి ఓం అని నాలుకతో మాత్రం ఉచ్చరిస్తున్నావేగాని దేనిని నీవు ధ్యానం చేస్తున్నావు? దివ్య జ్యోతిర్మయమైన పరమాత్ముని నేను ధ్యానం చేస్తున్నాను అన్నాడు. ఆ జ్యోతియే ఈ రూపాన్ని ధరించింది అన్నాడు కృష్ణుడు. నా పేరు కృష్ణుడు అన్నాడు. కృష్ణ వాసుదేవ పరమాత్మ అప్రమేయ వరద హరి ముకుంద నిన్ను చూడగంటి నీ కృప కనుగొంటి అఖిల సౌఖ్య ఫలముల నందగంటి అన్నాడు. అప్రమేయుడవు నీకు ప్రమాణములు లేవు. ఒక్కొక్కరు ఒక్కొక్క ప్రమాణముతో నిన్ను నిరూపిస్తారు కాని ఇది చాలా బుద్ధి తక్కువ. నీవు ప్రమాణ రహితుడవు. సముద్రమునైనా కొలత వేయవచ్చును. భగవంతుణ్ణి ఇట్టిది అట్టిది అని కొలతవేసే అధికారం ఎవరికీ లేదు. కనుకనే అతనిని అప్రమేయుడు అన్నారు.

## దైవబలము అన్నింటినీ మించినది

అప్రమేయ అనగా ప్రత్యక్ష ప్రమాణము, అనుమాన ప్రమాణము, శబ్ద ప్రమాణము అని మూడు ప్రమాణాలు. ఈ మూడు ప్రమాణములకు అతీతమైనవాడు. కారణమేమనగా శబ్ద ప్రమాణమైన వేదముకూడా కొంతవరకు మాత్రమే పోతుంది. ఆ లిమిట్ దాటిన తరువాత యథావాచా నివర్తంతే అప్రాప్య మనసా సహ! వాక్కుచేతగాని, మనస్సుచేతగాని, ఇంకే విధమైన భావముచేతగాని నిన్ను వర్ణించుటకు సాధ్యము కాదు. అంతేకాదు ఇవన్నీ వదలిన తర్వాతనే నీవు నాకు లభ్యమవుతావు అని కూడా వేదం బోధిస్తుంది. ఓ భగవంతుడా! న కర్మణా న ప్రజయా ధనేన త్యాగేనైకే అమృతత్వ మానశుః. నీ యొక్క అమృతత్వం నాకు లభించాలనుకుంటే కర్మలచేత కాదు. సత్సంపత్తి చేత కాదు. విద్య చేత కాదు. తపస్సు చేత కాదు. దానధర్మముల చేత కాదు. త్యాగము చేతనే ఈ యొక్క భోగము నాకు లభిస్తుంది. ఇవన్నీ కూడను ప్రాకృతమైనటువంటివే. ఈ ప్రాకృతమైనదంతా ప్రవృత్తి మాత్రమే. అనగా అప్పటికప్పుడు పుట్టేవి. అప్పుడే పోయేవి.

ఒక చిన్న ఉదాహరణము. ఒక వ్యక్తిగాని లేక ఒక విషయంగాని శాశ్వతంగా ఉండేది ఒక్కటి మీరు చెప్పండి. అన్నీ మార్పు చెందేవే. కనుకనే అన్ని మార్పు చెందేవాటిలో మార్పు చెందనిది ఒకటి ఉంది. అదియే ఆత్మ తత్త్వము. దానిని గుర్తించాలనుకున్నప్పుడు దానికి

sri sathyasaivachanamrutam

తగిన అంతర్‌దృష్టిని మార్చుకోవాలి. ఎవరు ఏ విధంగా తలచినా, దైవ సంకల్పమనేది లేకపోతే ఎంతటి బలవంతుడైనా, ఎంతటి గుణవంతుడైనా, ఎంతటి విద్యావంతుడైనా వాని శక్తి హీనమై పోతుంది. ఎంతటి బలమున్న, ఎంతటి గుణమున్న, ఎంతటి శక్తిఉన్న ఏమి ప్రయోజనము? కర్ణుడంతటి వాడు కడపటి కేమయ్యె? కావలసినంత శక్తి ఉండినది అతనికి. సూర్య వరప్రసాదుడు. సూర్య కవచమును కూడా ధరించినవాడు. సూర్య కుండలములను ధరించినవాడు. కావలసినంత బలము, శక్తి ఉన్నాయి. దైవబలము లేకపోతే కడపటికేమయ్యె కర్ణుడంతటి వాడు. దీనికొక చిన్న ఉదాహరణము. బలరామునికి, రేవతికి ఒక బిడ్డ పుట్టింది. ఆమె పేరు శశికళ. బలరాముడు మొట్టమొదట ఈమెను దుర్యోధనుని కుమారుడైన లక్ష్మణునకిచ్చి పెండ్లి చేయాలని భావించాడు. దుర్యోధనుని కుమారుడు లక్ష్మణ కుమారుడు. మొట్టమొదటి నుండి బలరాముడు ఈ లక్ష్మణ కుమారునికి అన్ని విద్యలు నేర్పుతూ వచ్చాడు. చిన్న చిరునవ్వు నవ్వుతూ కృష్ణుడు చెప్పాడు. ఈ శశికళకు లక్ష్మణునికి యేమాత్రం పొత్తులేదు. వీరిద్దరికి ఏనాటికి కుదరదు. మీరు ముందుగా ఈ విధంగా ప్లాన్ వేయటం మంచిది కాదన్నాడు. సరే ఏదో తమ్ముడు చెప్పాడని అలక్ష్యము చేస్తూ వచ్చాడు బలరాముడు.

ఒక సన్నివేశం ప్రారంభమైంది. పాండవులంతా అరణ్యవాసం వెళ్ళారు. వారందరితో ద్రౌపది మాత్రం వెళ్లింది. సుభద్రగాని, అభిమన్యుడుగాని అరణ్యవాసం పోలేదు. ద్వారకలోనే ఉన్నారు. అక్కడ లక్ష్మణ కుమారునికి బలరాముడు అస్త్ర విద్యలు నేర్పితే ఇక్కడ అభిమన్యునికి కృష్ణుడు అస్త్ర విద్యలు నేర్పాడు. ఈ విధంగా చూస్తే దుర్యోధనునికీ అర్జునునికీ ఏ విధంగా సంబంధం లేదు. east, westగా ఉంటున్నారు. ఇక్కడ బలరాముడు నేర్పటం అక్కడ కృష్ణుడు విద్యలు నేర్పటం north, southగా ఉన్నాయి. east, west చేరాలంటే north, south అడ్డం వస్తూ ఉంటాయి. north, south చేరాలంటే east, west అడ్డు వస్తుంటాయి. ఈ రెండింటికి పొత్తే కుదరదు. ఈ విధమైన స్థితిలో ఒకనాడు కృష్ణుని మాటలు ఉల్లంఘించి బలరాముడు ముహూర్తం పెట్టేశాడు. లక్ష్మణ కుమారునికి, శశిరేఖకు పెండ్లి చేయటం. ఈ సమయంలో భగవత్సంకల్పం ఏ నిమిషములో ఎలా మారుతుందో ఎవరూ చెప్పటానికి లేదు. భీముని కుమారుడైన ఘటోత్కచుడు ఒక్క రాత్రి లోపలనే ఆ లక్ష్మణ కుమారుని thoughts అన్నీ మార్చేశాడు. ఇక్కడ శశికళ మనసు పూర్తిగా మార్చాడు. నాకు లక్ష్మణకుమారుడు అక్కర



sri sathyasaivachanamrutam

లేదంది శశికళ. లక్ష్మణ కుమారుడు ఈ శశికళ నాకు sisterతో సమానము నాకక్కర లేదన్నాడు. ఈ ముహూర్తం పూర్తి గావించాలని పెట్టుకున్నాడు బలరాముడు. అప్పుడింక విధిలేక తమ్ముని వద్దకొచ్చాడు బలరాముడు. గోపాలా! ఈ విషయంలో నీవు తప్ప ఇంకెవరూ నాకు సహాయం చేసేవారు లేరు. కృష్ణుడు అప్పుడు చెప్పాడు బలరామా! ఈ యొక్క విషయంలోనే కాదు అన్నింటిలోనే నీకు నేను తప్ప ఎవరూ లేరు. ఈ ముహూర్తం లోపలనే నీయొక్క బిడ్డ పెండ్లి కావాలి. నేనెక్కడా చూడ లేదే? ఎవరిని విచారించలేదే? ఎలా అవుతుంది ఈ ముహూర్తం లోపల నాకు వదిలేస్తే ఈ నేను చూసుకుంటాను అన్నాడు. "సరే నా బిడ్డ అయినా నీ బిడ్డయినా ఒకటే. నీవే పూర్తి చేయమన్నాడు బలరాముడు.

కృష్ణుడు ఇంటి దగ్గరకు పరుగెత్తాడు. పెండ్లి పందిరి రెడీగా వుంది. పురోహితులు వచ్చారు. అన్నీ సిద్ధంగా ఉన్నాయి. ఒక చేతితో అభిమన్యుని, ఒక చేతితో శశికళను తీసుకువచ్చాడు కృష్ణుడు. సుభద్ర చెప్పింది. కృష్ణా! తండ్రిలేని సమయంలో ఈ విధంగా చేస్తున్నావే అంది. అభిమన్యుడు చెప్పాడు 'అమ్మా! నీవు యోచనచేయి. కృష్ణుడే మన సర్వస్వం. అతనే తల్లి తండ్రి దైవము, సర్వమూ, ప్రియమిత్రుడు అతడే మనకు. ఇన్ని విధముల కృష్ణుని గుర్తించి నీవు తిరిగి ఈ మాయలో పడిపోతున్నావే. అతని సంకల్పం ఎలా ఉందో అలా జరగనీ. ప్రతి దానికి yes yes yes. ఆ విధమైన దానిని గుర్తించుకోమన్నాడు. ఎప్పటికీ తల్లి తండ్రి అని గౌరవం ఇవ్వవచ్చును. కానీ దైవము లేకుండా తల్లితండ్రులు కూడా లేరు. కనుకనే తల్లితండ్రులనే దైవస్వరూపులుగా భావించుకొని వారి ఆజ్ఞను శిరసావహించటం మన కర్తవ్యమన్నాడు. అదే ముహూర్తములో అభిమన్యునికి శశికళకు వివాహం చేశాడు. ఇంక ఇక్కడ నుండి ప్రయాణం సలుపుతున్నాడు కృష్ణుడు. కేవలం కృష్ణుని చరిత్రలో వాళ్లని, వీళ్లని చంపటం అని భావించుకోవటం పెద్ద అజ్ఞానము. త్రేతాయుగములో ఇచ్చిన వరములన్ని ఈనాడు వారికి ఫలింపచేస్తూ వస్తున్నాడు కృష్ణుడు.

### ధర్మ సంస్థాపనమే కృష్ణుని ఆశయము

అంతేగాని కృష్ణుడు ప్రత్యేకంగా ఒక యుద్ధమును సృష్టించటము లేక వీళ్లని చంపటము ఇలాంటివి కాదు కృష్ణుని లక్షణాలు. ధర్మ సంస్థాప నార్థాయ సంభవామి యుగేయుగే. ఆనాడు

srisathyasaivedamrutam

ఇచ్చిన మాటలను ఈనాడు నెరవేర్చుకుంటూ పోయాడు. ఈ విధంగా వచ్చేటప్పటికి అజ్ఞాతవాసంలో ఉన్నారు పాండవులు. విరాటరాజు గృహంలో ఉంటున్నారు. ఇక్కడ చాలా తమాషా జరిగింది. భగవంతుని విస్మరించి లోకాన్ని విశ్వసించి జీవించే వీరులకు ధీరులకు గంభీరులకు కలిగే అవమానం ఎలాంటిదో నిరూపించాడు. దుష్ట చతుష్టయము, దుర్యోధనుడు, దుశ్శాసనుడు, శకుని, కర్ణుడు వీరు నలుగురు చక్కగా గుమిగూడారు. వీరు నలుగురు ఒక plan వస్తూ వచ్చారు. ఏమంటే విరాటరాజు గోవులనంతా కట్టివేసి మనం యుద్ధమునకు పూర్వమే ఒక్కొక రాజును మనము యేవిధంగా జయించాలి అని వీరు రిహార్సల్సు వేస్తున్నారు. అర్జునుడుగాని, భీముడుగాని, నకుల సహదేవులుగాని వస్తే వారినేరీతిగా మనం ముట్టడించాలి అని గోవులపైన experiments చేస్తూ వచ్చారు. ఈ వార్త విరాటరాజుకు తెలిసింది. అతని కుమారుడు ఉత్తరుడు వెళ్ళినాడు. అప్పుడు విరాట రాజు కుమారుడొక్కడే వెళుతున్నాడని అభిమానం కలిగింది.

బృహన్నల విరాటరాజు కుమార్తెకు నాట్యం నేర్పుతున్నాడు. తక్షణమే విరాటరాజు చెప్పాడు. బృహన్నలా! నీవు కుమారునితో పొమ్మన్నాడు. కొంచెం ఊరు దాటిపోయాడు. అజ్ఞాతవాసము టైమ్ కూడా ముగిసి పోతోంది. ఒకటి రెండు దినములలో ఆ సంవత్సరం అయిపోతుంది. ఇంక ప్రపంచానికి పాండవులని తెలిసినా తప్పులేదు. తక్షణమే ఉత్తరుని పిలిచాడు. నీవు బాలుడవు నీకు తెలియదు. నీవు వెనుక కూర్చో నేను ముందు కూర్చుంటానని సారథ్యాన్ని అర్జునుడు తీసుకున్నాడు. అర్జునుడు వీరినంతా తరుముతూ పోతుంటే ఎక్కడ వారక్కడ పరుగెత్తి పోతున్నారు. ఈ సమయంలో వీడెవడో ఉత్తరుని సేనాధిపతి వచ్చాడు. వీనిని చంపితే మహాభారత యుద్ధములో మనము ఉండమేమోనని కర్ణుడు ఏకంగా వెళ్ళిపోయాడు. కడపటికి వీరిని అవమానం చేయాలనుకున్న దుర్యోధనుని త్రాడుతో కట్టాడు. ఇతని త్రాళ్లతో కట్టి తీసుకుపోతుంటే దుర్యోధనుడు అనుకున్నాడు. వీడెవడో బ్రాహ్మణుని మాదిరిఉన్నాడు. కాబట్టి ఈ బ్రాహ్మణునికే ఇంత శక్తి ఉంటే ఈ విరాటరాజు రాజ్యంలోపల ఇంక పాండవులొస్తే ఏ విధంగా మనం సంహరిస్తామని అనేక విధములుగా యోచన చేస్తూ వచ్చాడు. ముందుగానే వెళ్లిపోయాడు. బృహన్నల విరాటరాజు ఇంటికి రెండవ రథంలో వీడిని తీసుకురమ్మన్నాడు. ఆ మూడవది వానికి ఈ అజ్ఞాతవాసము టైము మిగిలిపోయింది.

sri sathyasaivachanamrutam

జమ్మివృక్షము మీది ఆయుధాలన్ని తీసుకున్నారు ఈ ఐదుమంది. అర్జునుడు, భీముడు, నకులుడు, సహదేవుడు అందరు వారి వారి ఆయుధాలు పట్టారు. ఇంక ద్రౌపది కూడ ఆమె సహజస్థితికి వచ్చింది. ధర్మరాజు కూర్చున్నాడు. పాండవులు నిల్చొని అతనితో సరియైన వినయముతో మాట్లాడుతున్నారు.

ఈ సమయంలో దుర్యోధనుని కట్టి ధర్మరాజు వద్దకు తీసుకొని వచ్చారు. కృష్ణుడు చేసే పనంతా యిలాంటివే. ఊళ్లో వాళ్ల కెదురుగా పోయి కులికేవాడుట. ఎవరిని హాస్యం చేయాలనుకున్నారో వారి ఎదుటే హాస్యమై పోయింది. అప్పుడు ధర్మజుడు వీని కట్లు విప్పి పంపించండి అంటే వీడు బ్రతికి పోతాడు. లేకుంటే దుర్యోధనుడు అక్కడనే ఛస్తాడు. ధర్మజా! వీని పరిస్థితి ఏమిటి మీరే నిర్ణయం చేయాలి అన్నాడు. చూస్తున్నాడు. ఇతను ధర్మజుడు, ఇతను భీముడు, ఇతను అర్జునుడు, ఇతను నకులుడు, ఇతను సహదేవుడు. భీముడు గుడ్లురుముతున్నాడు. వాని అర్ధ ప్రాణమంతా పోయింది. ధర్మజుడు ఒక్కమాట చెప్పాడు. పరులు హింసించటానికి వస్తే మేమంతా 105 మంది. పాండవులు కౌరవులు అని భేదమువస్తే మేము 5 మందిమి. కనుక ఈనాడు దుర్యోధనునికి అవమానము జరిగితే మనకు కూడా జరిగినట్లే కనుక కట్టువిప్పి వెనుకకు పంపివేయండి. ఈ విశాల హృదయానికి ఒకవైపున సంతోషిస్తున్నాడు దుర్యోధనుడు. ఒక వైపు అయ్యో! వీరిని నేను అవమానం చేయాలనుకుంటే నేనే అవమానమైపోయానే అని బాధపడి ప్రాణము పోయిన స్థితిలో ఉన్నాడు. తిరిగి పోయేకంటే ప్రాణము తీసుకొనటం మంచిదని ఆత్మహత్యకు సిద్ధం చేసుకున్నాడు. కర్ణుడు, దుశ్శాసనుడు వీరంతా వచ్చి నివారణచేసి కొంత ధైర్యం చెప్పి సమాధాన పరిచారు. దీనికి తగినట్లుగా కృష్ణుడు మధ్యలో వచ్చి దుర్యోధన విజయం జరిగిదంతా అని అడిగాడు. పంచ ప్రాణాలలో నాలుగు ప్రాణాలు పోయాయి. ఈ విధంగా అనేక రకాలుగా కృష్ణుడు తనయొక్క భాగ్యతను దూరం గావించుకున్న వ్యక్తులకు ఈ విధమైన పరాభవం చేసేవాడు.

ఈ సమయాన్ని పురస్కరించుకొని విరాటరాజు అర్జునుని రెండు చేతులు పట్టుకొని మీరెవరో అనుకొని ఇంతకాలం నేను మిమ్మల్ని గుర్తించలేకపోయాను. రాబోయే కలియుగమునకు ఆదర్శ ప్రాయమైన పంచప్రాణాలే ఈ పంచపాండవులు. ఇలాంటి వారిని



srisathyasaivachanamrutam

నా ఇంట్లో ఒక సంవత్సరం పెట్టుకోవటం నాకెంత అదృష్టం అనుకున్నాడు. అర్జునా! నీవు నా కుమార్తె ఉత్తరను వివాహమాడి నా మనసుకు శాంతి కలిగించమన్నాడు. ఆనాటి టీచర్సుకు ఈనాటి టీచర్సుకు ఉండే వ్యత్యాసం తెలుసుకోవాలి. ఈనాడు స్టూడెంట్సుని మేరేజ్ చేసుకుందుకు సిద్ధమవుతున్నారు. టీచర్సుకి బిడ్డలతో సమానము. అప్పుడు అర్జునుడు చెప్పాడు. మహారాజా నేను మీ కుమార్తెకు మాస్టరుగా వచ్చాను. నాకు ఆమె పుత్రికతో సమానము. కనుక ఆమెను ఈ భావముతో చూడటము పాపము. తలంపే మనకు రాకూడదు.

**సత్ప్రవర్తన సద్బుద్ధి సత్యనిరతి**
**భక్తి క్రమశిక్ష కర్తవ్య పాలనంబు**
**నేర్పునదె గురువు విద్యార్థి నేర్వవలయు**

నేను ఆ విధమైన గురువును. ఈ పాపపు భావము రాకూడదు అన్నాడు. అప్పుడు నీకు ఇష్టమైతే నాకు అభిమన్యుడు కుమారుడు ఉన్నాడు నా కుమారుని చేసుకొని నాకు కోడలుగా ఉండినప్పుడు నాకు కోడలు బిడ్డతో సమానము. ఆ విధముగా కావలసి ఉంటే నా యింటికి తీసుకువెళతాను. అక్కడ అభిమన్యునికి శశికళ ఉందని తెలియదు. అజ్ఞాత వాసములో ఉంటున్నారు. అదే అజ్ఞానము. ఇంక పంపించాడు విరాటరాజు అందరి రాజులకు ఆహ్వానములు. ద్రుపద మహారాజు వచ్చాడు మహా సైన్యముతో రుక్మిణి తండ్రి వచ్చాడు భీష్మకుడు. అందరు వారి పరివారముతో వచ్చారు. ఈ భీష్మకుడు తన కుమారునితో తన పరివారముతో వచ్చాడు. ఉగ్రసేన మహారాజు వచ్చాడు. యాదవరాజులందరు వచ్చి చేరిపోయారు.

వారితోబాటు సుభద్ర, అభిమన్యుడు, రుక్మిణి, సత్యభామ వీరందరు వచ్చారు పరివారము. శశికళ వచ్చింది. ఎందుకో వారికి తెలియదు. విరాటరాజు కుమార్తె వివాహము అని తెలియదు. ఎవరికిస్తారో తెలియదు. ఆనాడు లగ్నపత్రికలంతా లేవు. మనష్యులతో పంపించే వార్తలే. ఆనాటి రాజులు ఈ భటులతో తమ తలంపులు పంపేవారు కాదు. చాలా secretగా ఉండేది. సరి సమానమైన రాజులకుగాని వారి భావములుగాని వూహలుగాని గుర్తింపచేసే వారు కాదు. ఈ విధముగా అందరు చేరినారు వివాహమునకు గొప్పగా యేర్పాటుగావిస్తూ వచ్చాడు

sri sathyasaivachanamrutam

విరాటరాజు. అక్కడకు చేరిన తరువాత అర్జునునకు తెలిసింది శశికళ ఉంటున్నదని. అభిమన్యునికే ఈ ఉత్తరు నిచ్చి వివాహము చేస్తున్నామని తెలిసింది. బ్రాహ్మణులంతా ఉంటారు కదా! రెండైనా తప్పులేదు మూడైనా తప్పులేదు అనేక రకములుగా చెప్పారు. సుభద్ర మెత్తగా అతనితో చక్కగా మాట్లాడుతూ నవ్వుకొంటూ నీకేమి తక్కువ పెండిండ్లు? నీ కొడుకుకు కూడా అట్లా చేయి. నీకు ఆరుమంది భార్యలు. నీ కుమారునకు కూడను చేయాలని చెప్పింది. తమాషాగా ఆనందంగా జరిగిపోయింది. ఆనాటి వారి భావాలు ఎంత గొప్ప భావాలో యోచన చేసుకోండి. నిజంగా తన భర్తని ఇంకొకరికి ఇచ్చి వివాహము చేస్తున్నారంటే ఈమె కంటిధారలతో కృంగి పోవలసిందే. అందరికంటె ఎక్కువ ఆనందపడుతున్నది శశికళ. ఈ వ్యక్తి నా వ్యక్తి అని చెప్పుకోటానికి నాకు ఏమి అధికారము ఉంది. భగవంతుని సంకల్పముతో ఎంతమందికి ఈ వ్యక్తి అధికారమో. అందువల్ల ఉత్తరను తీసుకువచ్చారు. చక్కగా వివాహము జరిగింది. ఈ వివాహము లోపల ప్రతి దానికి శశికళే పెద్దగా వచ్చింది.

ఈ విధంగా జరిగి ఒక పెద్ద మీటింగు జరిగింది. ఈ పాండవులు ఎక్కడ ఉండాలి. ఎందుకంటే అందరు రాజులు చేరినారక్కడ. ఈ అభిమన్యుని పెండ్లికని అందరు బంధువులు వచ్చి చేరిపోయారు. కౌరవులను ఎదుర్కొవాలి. ఒక్కొక్కరు ఒక్కొక్క విధముగా చెప్తూ వచ్చారు. కృష్ణుడు చెప్పాడు. మొట్టమొదట మీరు ధృతరాష్ట్రునికి నమస్కారం చేయండి. దుర్మార్గుడైనప్పటికి, దుష్టుడైనప్పటికి నీ కర్తవ్యమును నీవు వదలకూడదు. మేము ఎక్కడ ఉండాలి అని అడగండి. మీ యొక్క పూర్వపు రాజ్యము నందిస్తే సంతోషమే. లేకపోతే తరువాత మనము వేయవలసిన ప్లానులు వేస్తాము. నాలుగు రకములు ఉన్నాయి. మనము మొట్టమొదట న్యాయముగా వెడదాము. తరువాత తనయొక్క ప్రార్థనతో అంగీకరిస్తాము. సామ దాన భేద దండోపాయములు. పాండవులు ఈనాటికి ఏనాటికి అతని మాటనే ప్రాణం. ఏమైనా చెప్పనీ. ఈనాడు అట్లా కాదు. మీకు అనుకూలమైనట్లు వస్తే సరి అనుకూలమునకు విరుద్ధముగా వస్తే కృష్ణునిపైన అయినా ద్వేషమే. అందువలనే పంచపాండవులలో ఉన్న భక్తి ప్రపత్తులు ఒక్క వ్యక్తియందు కూడను కనిపించటం లేదు. అరణ్యములో బాధలు అనుభవించారు. ఇంద ప్రస్థములో, హస్తినాపురములో కావలసినన్ని బాధలు అనుభవించారు. లక్క గృహములో పెట్టి అగ్నిపెట్టారు. భీముని పాములతో చంపి నదిలోకి త్రోసివేశారు. అన్నములో విషము పెట్టి పంచపాండవులకు యిచ్చారు. ఎన్ని



sri sathyasai vahini amrutam

చేసినప్పటికి అప్పుడు కూడా కృష్ణార్పణం అని భుజించటము. అది అచంచల భక్తి. అది ఏకైక భక్తి. అదే సాధ్య భక్తి. అదే పరాభక్తి. ఆ విధమైన భక్తితో ఉండటం చేత పాండవులు కలియుగములో కూడను వారి ప్రభావము ఆదర్శవంతముగా నిలిచి పోయింది.

**కృష్ణరాబారము**

అద్వితీయమైనది భక్తి. కష్టమునందుగాని నష్టమునందుగాని నిందలకుగాని నిష్ఠూరములకుగాని అన్నింటికిని మా కృష్ణుడే. అదే నిజమైన శరణాగతి. ఆ శరణాగతి చేసిన వానికి తానే అన్నీ చూసుకుంటాడు. స్వామీ నా యొక్క జీవితమును ధన్యము చేయండి అని కోరుతూ వచ్చారు. వారికి కావలసిన కిరీటము అదొక్కటే. ఈనాడు మనము ఇంత బంగారము తీసుకుపోయి కంసాలి వానికిచ్చి చైన్ చెయ్యాలి ఈ విధమైన మోడల్‌లో ఉండాలి అని మాత్రము ఇస్తున్నాము. దానియొక్క weight తీసుకొని అంతేగానీ నా gold అగ్నిలో వేయకూడదు సుత్తితో కొట్టకూడదు విరగకూడదు ముక్కలు చేయకూడదు అంటే ఇంక నగ ఎట్లా తయారౌతుంది. ఊరికే వాని చేతికి ఇవ్వండి. ఏ డిజైన్ చెయ్యాలో చెప్పండి తాను ఎంత weight ఇచ్చారో మరల తీసుకునేటప్పుడు అంత weight చూసుకోండి. అంతేగానీ మిగతాదాంట్లో ప్రవేశించే అధికారము నీకు లేదు. అప్పుడు ఆయన నీ gold తీసుకొని చైన్ చేస్తాడు. అట్లానే పాండవులు మాకు శాంతి అనే కిరీటము మా తలలో చేర్చు అన్నారు. అంతే ఏమిచేస్తాడో ఎట్లా చేస్తాడో ఏమైనా చేసుకోనీ.

సంధి సమయము లోపల ధృతరాష్ట్రుని దగ్గరకు వెళ్ళాడు కృష్ణుడు. జగన్నాథుడు లోకనాథుడైనవాడు ఒక ఎంబాసిడర్‌గా వెళ్లాడు పాపం. కారణం ఏమిటి? వీరు నాకు పరమ భక్తులు భక్తుల కోసం ఏమైనా చేస్తాను. ఈ సంభాషణ లోపల ధృతరాష్ట్రుడు ప్రశ్నిస్తాడు. కృష్ణా కౌరవులు, పాండవులు ఇద్దరు అన్నదమ్ముల బిడ్డలే. వారు నీకు ఒకకన్ను వీరు నీకు ఒక కన్నే. కానీ నీవు చాలా పక్షపాతము చూపుతున్నావు. ధర్మజులవైపు నీవు రాయబారిగా వచ్చావుగాని కౌరవుల పరిస్థితి ఏమిటి? చెప్పాడు కృష్ణుడు కౌరవులు, పాండవులు ఇద్దరు నాకు ఒక్కటే. ఇరువురికి సత్కీర్తి రావాలని నేను సంధికి వచ్చాను అన్నాడు. ఇరు వంశములు కూడను భద్రముగా ఉండాలి. కాని నీకు ఈ పుత్ర వాత్సల్యము చేత దుర్మార్గులైన కుమారులను నీవు

sri sathyasai vachanamrutam

అనేక రకములుగా encourage చేస్తున్నావు. ఇది చాలా తప్పు. దుర్మార్గుడైన కొడుకును చూస్తే ఒక విధమైన మలముగా భావించు. నీ దేహములో ఉన్న మలినమును పరిశుద్ధము గావించుకోవటం లేదా. ఈ దుర్యోధన దుశ్శాసనాదులు ఎంత క్రూరమైన కార్యాలకు పాల్గొంటున్నారు. అని చాలాగట్టిగా బోధించాడు భీష్ముడు, కృపాచార్య, అశ్వత్థామ సరిసరి చక్కని మాట అని వారు సంతోషించారు. ఇది కేవలము రాజులకు మాత్రమే కాదు బాధ. నిరపరాధులైన ప్రజలు ఎంతమందో ఇందులో ప్రాణములు వదులుతారు. కనుక ఇది మంచిది కాదని కృష్ణుడు ఎన్ని విధములుగానో బోధించాడు. అంతేకాదు పాండవులు నిన్ను ఏమి హింసించరు. ఆనాటి మొదలు ఈనాటి వరకు చాలా గౌరవముగా ఉంటున్నారు. నిన్ను ప్రార్థించమని పదే పదే చెప్పాడు. మా ఇంద్రప్రస్థము మాకు ఇవ్వటానికి ఇష్టము లేకపోతే మా ఐదుమంది అన్న తమ్ములకు ఐదు గ్రామములైనా ఇచ్చి వేయమన్నాడు. వారందరు ఈ రాజ్యములో ప్రవేశిస్తున్నారు. అలాంటి సమయము లోపల వారు వస్తే ఎక్కడ ఉండాలి. ఇంత కాలము వారి స్త్రీలు పరుల ఇండ్లలో ఉంటున్నారు. వారు వచ్చిన తరువాత వారి స్వంత ఇండ్లలో ఉండనక్కర లేదా? ఎన్ని కష్టములకో గురైపోయినారు పాండవులు. ఆకులలములు మేసి పశువులవలె జీవించారు. ఈ విధముగా కష్టపడింది చాలకుండా ఇప్పుడు వీరికి ఏవిధముగా ఏర్పాటు చేయకుండా పోతే ఇది మహా పాపమన్నాడు. అప్పుడు ధృతరాష్ట్రుడు అడిగాడు. వారిపైనున్న ఈ ప్రేమ వాత్సల్యములు వెయ్యింట ఒక భాగమైన లేదా నా కుమారులపైన అన్నాడు. యద్భావం తద్భవతి. ఎవరు ఏ విధముగా నన్ను తలుస్తారో వారికి ఆ విధముగా నేనుంటాను. ఎంత మాత్రమున ఎవ్వరు తలచిన అంత మాత్రమే నేను. సముద్రములో కావలసినంత నీరు ఉంటున్నాది. చిన్న గిన్నె తీసుకుపోతాడు. ఒకడు పెద్ద గిన్నె తీసుకుపోతాడు. ఎవరెంత తీసుకుపోతే అంత నీరు వస్తుంది. పాత్రభేదములేగాని దానిలో నీటి భేదము లేదన్నాడు. ఇదేమి కృష్ణా! నీవు కేవలము పాండవుల పక్షముగానే మాట్లాడుతున్నావుగాని నీకు పాండవులకు ఉన్న సన్నిహిత సంబంధము ఏమిటి? నా కొడుకులకు నీకు ఉండిన ద్వేషము ఏమిటి? అని ప్రశ్నించాడు ధృతరాష్ట్రుడు.

ధృతరాష్ట్రా! నేను సత్యమును పలుకుతున్నాను సభ లోపల. నాకు లోపల ఒకటి బయట ఒకటి లేదు. నాది రెండింటి యందు ఒకటే. అదే proper study of man kind is



sri sathyasai vachanamrutam

man. నా thoughts నా words నా action ఒక్కటే. కనుక ఈ సభ అంతా విన్నప్పటికి ఫరవాలేదు. నేను సత్యమునే చెప్తున్నాను వినమన్నాడు. దేహమునకు ఎన్ని భాగములో నీకు తెలుసునా? గుడ్డివాడు నీకు తెలియదు. మొట్టమొదట శిరస్సు. ఆ శిరస్సు భుజముపైన ఆధారపడి ఉంటుంది. ఈ భుజములు కడుపుపైన ఆధారపడి ఉంటున్నాయి. ఈ కడుపు కాళ్లపైన ఆధారపడి ఉంటున్నాయి. నకుల సహదేవులు కాళ్లవంటివారు. Stomach భీముడు. భుజములు అర్జునుడు. నా శిరస్సు ధర్మరాజు. ఇలాంటి శరీరములో కృష్ణుడు herat వంటివాడుగా ఉన్నాడు. కనుక ఈ దేహమునకు herat ఎట్టి సన్నిహిత సంబంధమో పాండవులకు నాకు అట్టి సన్నిహిత సంబంధము అన్నాడు. herat లేకపోతే body లేదు. Body లేకపోతే heratను గుర్తించటానికి వీలుకాదు. పాండవులవల్లనే కృష్ణునియొక్క కీర్తి. కృష్ణుని వల్లనే పాండవులకు విజయము. ఇవి రెండు అన్యోన్య ఆశ్రయము. అవినాభావ సంబంధము. ఈ మాటతో సభ అంతనూ కదిలిపోయింది.

పాండవులపై ఇంత ప్రేమ ఉండిన కృష్ణుడు ఎవ్వరూ యితనిని జయించలేరు అన్నారు. అందరు సభలోని పెద్దలు, ధృతరాష్ట్రా! కృష్ణుని మాట జవదాటవద్దు నీకు వినాశకాలము వచ్చినప్పుడే విపరీత బుద్ధులు వస్తాయి. కొడుకుల నోరు మూయించు. వారు రాగానే వారి ఇంద్రప్రస్థము వారికి ఇచ్చివేయి. భీష్ముడు కూడను గట్టిగా చెప్పాడు. కేవలము దుర్యోధనుడు కుత్సితమైన కర్ణుని మాట వింటున్నాడు. అప్పుడు చక్కగా చెప్పాడు కృష్ణుడు. కర్ణునికి అప్పుడే ఐదు ప్రాణములు పోయినాయి అన్నాడు. ఇంక ఆరవ ప్రాణము అర్జునుని చేతిలో ఉంటున్నది. కర్ణుడు కూడా ఆ సభలో ఉంటున్నాడు. ఏమిటి ఐదు ప్రాణములు పోవటమని ప్రశ్నించాడు. మొట్టమొదటిది తల్లి నదిలో వదలి పెట్టింది. తల్లి ప్రేమకే గురికానటువంటి వాడు కర్ణుడు. కాబట్టి ఒక ప్రాణం పోయింది. రెండవది ఇంక తండ్రి సూర్యుడు. అతను ఎంతో ప్రేమతో ఇచ్చిన కవచాన్ని అంతా ధారపోసుకున్నాడు. అతని ప్రేమ పోయింది. ఇంద్రుని వల్ల కుండలాలు పోయినాయి అది మూడో ప్రాణం. ఇంక నేను ఎంతో బోధించాను అతనికి కర్ణా ఇది మంచిది కాదని. నా బోధనలు వినలేదు. దానితో నాల్గవ ప్రాణం పోయింది. తదుపరి గురుడైన పరశురాముని శాపానికి గురియైనాడు. లోకములో ఉండేది తల్లి, తండ్రి, గురువు దైవము. కాబట్టి తల్లి ప్రేమ పోయింది. తండ్రి ప్రేమ పోయింది. గురువు ప్రేమా పోయింది. దైవము

sri sathyasai vachanamrutam

ప్రేమ పోయింది. ఇంద్రుని యొక్క ప్రేమ పోయింది. ఆ ఇంద్రుని యొక్క కుమారుడే ఈ అర్జునుడు. అర్జునునితో ఆరవ ప్రాణం పోతుంది. కనుక కర్ణుడు ఇప్పుడు పూర్ణప్రాణముతో లేడు.

ఈ మాట వినేటప్పటికి కర్ణునికి కోపం వచ్చింది. కాని సత్యములే ఇవన్నీ. ఈ సమయాన్ని పురస్కరించుకొని కృష్ణుని బంధించి చంపాలని ప్రయత్నము చేశాడు. పరుగెత్తి వచ్చాడు పాపం విదురుడు. కృష్ణుని కాళ్లు పట్టుకున్నాడు. స్వామీ! ఇంక ఎక్కువ కాలం మీరీ సభలో ఉండకూడదు. పోదాం రండి అన్నాడు. తాను చెప్పాడు విదురా! నీవు భయపడ వద్దు. ఏమి చేయగలరో అది కూడా చూద్దాము అని ధైర్యంగా నిల్చాడు. ఆ సభలో చెప్తున్నాడు కృష్ణుడు. ఉన్న సత్యాన్ని విన్నవించిన కృష్ణుని ఏమి చేయాలనుకున్నారో అది తప్పక చేయండి అని అన్నీ పారవేసి నిల్చున్నాడు. ఎక్కడి వారక్కడ స్తంభించిపోయారు. ఆ యొక్క సభలో కృష్ణ పరమాత్మకు జై అని దద్దరలిపోయాయి. జయజయధ్వానాలు ఇంక వారు దీనికేమాత్రము ఒప్పుకోరనుకున్నారు. అక్కడ చెప్పేసి వచ్చాడు.

**పచ్చని రాజ వంశవని పాడొనరింప జనించినాడు కా**
**ర్చిచ్చయి ఆరేడు సూతసుతు స్నేహంబు దానికి తోడుగాడుపై**
**కచ్చెలు రేపె నాశకునిగాడు రగుల్కొనె మంట మింటవి**
**వ్వచ్చుని నింట నింక శరవర్షము తప్పదు విశ్వశాంతికై.**

అంతా కూడా శాంతి కోసమే. ఇంక వెడతానని చెప్పాడు. సభ అంతా అదిరిపోయింది. నిశ్శబ్దమై పోయింది. దుర్యోధన, దుశ్శాసన, కర్ణ, శకుని వీరంతా నిర్వీర్యమైపోయారు. జీవచ్ఛవములవలె పడిపోయారు. కొంతసేపయ్యాక వారి భావాలు ఒకరికొకరు చెప్పుకుంటూ లేచారు. తిరిగివచ్చాడు అర్జునుని దగ్గరకు. నమస్కారం చేశాడు అర్జునుడు.

**లెమ్ము ధనుంజయా! విధి బలీయము న్యాయము గెల్చు నిల్చు స**
**త్యమ్ము నశించు స్వార్థము సదాయుగధర్మమిదేగదోయి క**
**న్గొను మిక నంత్య కాలమున నూర్వురు బిడ్డల తండ్రికైన పిం**
**డమ్మిడు దిక్కు కల్గ రక్కటా గ్రహచారము తప్పి వచ్చినన్.**

sri sathyasaivachanamrutam

ధృతరాష్ట్రునికి నూరు మంది బిడ్డలున్నారు. కట్టకడపటికి ఒక్కడైనా పిండమిచ్చే వాడు ఉండడులే అన్నాడు. ఈ విధమైన ప్రతిజ్ఞను చేసి కృష్ణుడు వచ్చేశాడు.

కృష్ణునియొక్క తత్త్వములో న్యాయము, ధర్మము, ప్రేమ అనేవి పుట్టి పుట్టి పడింది. దీనికే లొంగనప్పుడు ఇంక యుద్ధానికి సిద్ధం కావల్సిందే కదా! ఎన్ని విధములో చెప్పి చూశాడు. కానీ ఈ దుర్మార్గులకు ఈ మనసు కరిగే టటువంటిది కాదు. ఎందుకంటే అది విపరీతి బుద్ధి. వినాశ కాలము. ఎంత చెప్పినా దైవము వచ్చి దానిని తుడిచినా అది పోదు. బొగ్గులు తెల్లగా చేయాలంటే పాలతో కడిగితే తెల్లగా అవుతుందా? పాలు కూడా నల్లబడి పోతాయి. సబ్బుతో తోమితో తెల్లగా అవుతుందా? సోప్ కూడా నల్లగా అయిపోతుంది. ఈ బొగ్గులు తెల్లగా చేయాలంటే ఏమి చేయాలి? బొగ్గు యేరీతిగా అయింది. అగ్నిలో వేసినప్పుడు అది బొగ్గు అయింది. ఆ బొగ్గు తిరిగి అగ్నిలో వేయి. బాగా కాలి కాలి తెల్లగా ధూళి అయిపోతుంది. కనుక నీవు దీనిని పాలతోగాని సోప్‌తోగాని కడగటానికి ప్రయత్నం చేస్తే ప్రయోజనం లేదు. కనుక ఈ దుష్టచతుష్టయము బొగ్గుతో సమానము. వీరిని మంచి మాటలతో కడిగితే ప్రయోజనం లేదు. మన మాటలకు కూడా విలువ పోతుంది. చక్కగా సభ అందరికీ కృష్ణుడు ఎలాంటి బోధ చేశాడు. ఎలాంటి ధర్మం బోధించాడు. ఎలా సంధికి ప్రయత్నం చేశాడు అనేది సర్వులకు తెలిసిపోయింది.

కనుక భగవంతుడేది చెప్పినా, ఏది చేసినా, ఏది చూసినా అంతా న్యాయం ధర్మం తప్పి ఏమాత్రం నడవుడు. కానీ ప్రజలకు ఈ సత్యాన్ని గుర్తించే యోగ్యత లేదు. వాళ్ల బుద్ధి అంతనే ఉంటుంది. ఎలుక తోలు తెచ్చి ఎంత తోమినా నలుపు నలుపేగాని తెలుపురాదు. అది రానేరాదు. గొర్రె తోక పట్టుకొని సాగదీసినా అంతే ఉంటుంది కాని సాగదు. ఇంక ఈ దుర్మార్గులకెన్ని విధాల చెప్పినా వస్తుందా? ఉండేదే అంత. కనుక ఈ కౌరవులతో మనకేమాత్రం పనిలేదని వెనక్కివచ్చాడు.

**కాలకూటమున అమృతము సృజింప వీలా**
**భయద దావాగ్నిలో మల్లెపూలు వెదజల్లుట మేలా**
**ముష్కరుల మ్రోల హితోక్తులు వీలా**

srisathyasai vahinamrutam

**గుణజాల! ఏల ఈ సంధి మాటలిక గోపాలా!**

ఈ సంధి మాటలే వద్దింక మనకి. ఇదంతా కేవలం దుర్బుద్ధులతో నిండిన సభ. ఎవరు అంత మహాసభలో దుర్మార్గులు విరోధులైన వారి దగ్గర ఇంత గట్టిగా చెప్పే అధికారం ఎవరికి ఉంటుంది? ఒక్క దైవానికి మాత్రమే. కనుకనే కృష్ణుడు ఈ విధంగా దిగ్విజయాన్ని సాధించాడు. అందువల్లనే భగవద్గీతలో కట్టకడపటికి

**యత్ర యోగీశ్వరః కృష్ణో యత్ర పార్థో ధనుర్ధరః**
**తత్ర శ్రీర్విజయోభూతిర్ధ్రువా నీతిర్మతిర్మమ.**

అన్నారు. ఎక్కడ కృష్ణుడు, ఎక్కడ పవిత్రమైన భక్తి ఈ రెండు చేరిఉంటాయో అక్కడ నీకు విజయము. అక్కడే నీకు సుఖము. అక్కడే నీకు స్వర్గము. అక్కడే నీకు ఆనందము అని చెప్పాడు.

**(తేది. 29-05-1989న భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam